# పేర్లకు పెళ్ళి చేశాడు

రాత్రి ఒంటిగంటయింది.

డాక్టరు గోపాలం కాలుగాలిన పిల్లిలా హాల్లో తిరుగుతున్నాడు.

ఏమీతోచక తిరుగుతున్నాడా?

కంగారు పడుతున్నాడా?

ఎవరిమీదయినా ఆగ్రహమా?

ఏమో-అతడికే తెలియటంలేదు.

ఎనిమిది గంటలకు క్లినిక్ నుంచి వచ్చాడు. రాగానే కొంచెంసేపు టీ. వీ. చూసి భోజనంచేసే అలవాటు.

ఆ రోజు టీ.వీ. చూడలేదు. వార్తలువినాలన్న ఆసక్తీలేదు. ఏదో కలవరం- ఏదో చికాకు.

రాత్రి పదిగంటల తరువాత కొడుకు ఇంటికివచ్చాడు. తన గదిలోకివెళ్ళి తలుపేసుకున్నాడు.

గోపాలం చూస్తూనేఉన్నాడు కాని పలకరించలేదు. వరండాలో ఉన్న పడ కుర్చీలో వాలాడు.

రాత్రి రెండోఆట సినిమాకువెళ్ళిన అన్నపూర్ణ నలుగురు స్నేహితురాళ్ళతో వచ్చింది గలగల్లాడుతూ అందరూ వంటఇంట్లోకివెళ్ళి టీ చేసుకుని తాగారు. వాళ్ళనుపంపించి లోపలికివచ్చిన అన్నపూర్ణ గదిలోకిపోతూ కుర్చీవంక ఒకసారి చూసి వెళ్ళింది.

రెండు గంటలవేళ టెలిఫోను మోగింది. బలవంతంగాలేచి ఫోనుఎత్తాడు.

"డాక్టరు గోపాలంగారా? నమస్కారం. పోలీసు ఇన్‌స్పెక్టరు రాజును మాట్లాడుతున్నాను. నంబరు నాలుగవవీధిలో రిక్షాకు ఆటోఢీకొని ఏక్సిడెంటయింది రిక్షా విరిగిపోయింది. అందులోఉన్న అమ్మాయికిందపడి స్మారకం కోల్పోయింది. కాలికి బాగా దెబ్బతగిలింది. అమ్మాయిని జనరల్ హాస్పిటల్లో కాజ్యువాలిటీలో చేర్చాము. ఆ అమ్మాయి ఎవరో తెలిసే అవకాశంలేదు. ఒక హౌస్ సర్జనుమాత్రం మీ ఫోను నంబరు ఇచ్చాడు."

"కాలు ఫ్రాక్చరయిందా?"

"ముందు పట్టీ కట్టారు తెల్లవారి ఎక్స్‌రేతీసి చూస్తారట."

"అమ్మాయి స్పృహలో ఉందా?"

"నాకు తెలియదు."

"మీ రెక్కడినుంచి ఫోను చేస్తున్నారు?"

"పోలీసుస్టేషన్‌నుంచి" ఫోను పెట్టేశాడు.

"అతడికి అమ్మాయిపేరు తెలియదు. ఎవరో ఫోనునంబరు ఇచ్చారని ఫోను చేశాడు. హౌస్‌సర్జను తన ఫోనునంబరు చెప్పటమేమిటి? నన్ను చూడమనా? ఎవరో తెలియకుండా వెళ్ళిచూడాలా?" గొణుక్కుంటూవెళ్ళి అమ్మాయి గదిలోకి తొంగిచూశాడు.

మంచంకుర్చీ ఖాళీగాఉన్నాయి. అయినా ఆ అమ్మాయి అమలేననుకోవటం ఎట్లా? ఒకవేళ అమల తెల్లవారేలోగా వస్తుందేమో?

మూడుగంటలయింది ఇంక ఆగలేక కారులో హాస్పిటల్‌కు బయలుదేరి క్యాజువాలిటీలోకివెళ్ళి హెడ్‌నర్సుతో తనకువచ్చిన ఫోనుసంగతిచెప్పి అమ్మాయిని చూస్తానన్నాడు డాక్టరు గోపాలం.

ఆ వార్డులో ఎంతోమంది కాళ్ళు విరిగినవాళ్ళూ, చేతులు విరిగినవాళ్ళూ, తల వగిలినవాళ్ళూ కుట్లతో, కట్లతో మంచాలమీద పడుకునిఉన్నారు.

"ఈ అమ్మాయిని పోలీసులు తీసుకునివచ్చి ఎడ్మిట్‌చేశారు" చూపించిందామె. "కట్టుకట్టి ఒక ఇంజక్షనిచ్చాము.''

అమ్మాయి మూలుగుతున్నది తల అటూ ఇటూ తిప్పుతున్నది బాధకొద్దీ. కనుబొమలు చిట్లిస్తున్నది.

గోపాలం ఒంగి ఆమె ముఖంలోకి చూశాడు.

ఆమెను చూడగానే అతడు ఉలిక్కిపడ్డాడు. ఆమె అతడి కూతురు అమలే. అంతలో అతడి ముఖం వాడిపోయింది.

"నా ఫోనునంబరు 32064 అమ్మాయి ఇప్పుడు పలికేస్థితిలోలేదు. తెల్లవారి వస్తాను. ఈలోపల డాక్టరు ఎక్స్‌రేతియ్యగానే ఫోను చెయ్యండి! అక్కడ కూర్చోటానికి వీలుగాలేదు. గోపాలం ఇంటికి వెళ్ళిపోయాడు.

ఇలా జరగటం ఇది మొదటిసారికాదు. అమల రెండుసార్లు పోలీసుల చేతబడి వాళ్ళ కస్టడీలోఉంది. తనకు ఫోనురాగానే వెళ్ళి ఏదోసాకుచెప్పి విడిపించుకు వచ్చాడు. తిండిలేక వేలాడిపోతుంటే దారిలోనే హోటల్‌కి తీసుకువెళ్ళి టిఫిన్, కాఫీ ఇప్పించి తీసుకువచ్చాడు.

కొడుకు హోటళ్ళలో, దుకాణాలలో బాకీలు పెడతాడు. వాళ్ళువచ్చి అడగ్గానే మాట్లాడకుండా బాకీలు తీరుస్తాడు. లేకపోతే తన పరువేంకాను? ఏంకాలమిది?

గోపాలం కావాలనే హాస్పిటల్‌నుంచి ఇంటికి ఆలస్యంగావచ్చాడు. అప్పటికి అన్నపూర్ణ స్నానంచేసి, భోజనాల బల్లదగ్గరకూర్చుని డబ్బాలో టిఫిన్ పెట్టుకుని భోజనం చేస్తున్నది.

కొడుకు ఇంకాలేవలేదు తొమ్మిదిగంటలయింది. హాస్పిటల్లో డాక్టర్లు వచ్చి ఉంటారు. ఫోనుకోసం పడక్కుర్చీలోవాలాడు. అన్నపూర్ణకు అమలసంగతి చెప్పాలనిపించలేదు. ఆమె అడగలేదు కాఫీ ఫ్లాస్కులో పోసుకుంటూ "ఇవాళ క్లినిక్ మూసివేశారా?" అడిగింది.

"జనరల్ హాస్పిటల్‌నుంచి టెలిఫోనువస్తుందని ఆగాను. ఇప్పుడు రాకపోయినా వెళ్తాను అక్కడ క్యాజువాలిటీలోఉన్న అమ్మాయి సంగతేమిటో కనుక్కోవాలి కాలి ఎముకవిరిగిందో, లేక చిట్లిందో తెలుసుకొని ప్లాసరువేయించి ఇంటికి తీసుకురావాలి."

"ఎవరా అమ్మాయి?"

''అమల!''

''మీ కెట్లా తెలుసు?''

''రాత్రి మూడుగంటలకు పోలీసుస్టేషనునుంచి ఫోనువస్తే వెళ్ళిచూశాను.''

''అయినా మీ కన్నిటికీతొందర హాస్పిటల్లో డాక్టర్ల మధ్యనేడుందికదా? వాళ్ళు వైద్యంచెయ్యరా? సాయంత్రంవెళ్లి చూడకూడదా? అది చిన్నపిల్లకాదు. పిల్లలు పెద్దవాళ్ళయిన తరువాత పెద్దవాళ్ళు అన్ని విషయాలలోనూ తలదూర్చ కూడదు వాళ్ళు బాధపడతారు.''

''వాళ్ళు బాధపడతారని కాలేజీనుంచి వెళ్ళగొట్టించుకున్న కొడుకును, సంగ తేమిటని అడగకూడదా? అడిగితే బాధపడతారని ఊరుకుంటే వాళ్ళ భవిష్యత్తు ఏమిటి?''

''ఎవరి భవిష్యత్తునుగురించి వాళ్ళే ఆలోచించుకుంటారు. పెద్దవాళ్ళ కెందుకూబాధ? పిల్లలకామాత్రం తెలియదా?''

''నీకు బాధలేదుగాని, మీ అబ్బాయిని ఈ ఈకారణాలవల్ల కాలేజీనుంచి వెళ్ళ గొట్టామని తండ్రిపేరున నోటీసువస్తే ఆ బాధ ఎవరికి? నీ కొడుకు బాకీ ఉన్నాడని చీటీలువస్తుంటే పరువుకోసం డబ్బుకట్టిన తండ్రికి బాధ కాదా?''

''ఓహో-అదా బాధ? డబ్బు ఖర్చయిందనా?''

గోపాలానికి కోపంరాలేదు ఆమె దృష్టిలో కన్నవారి బాధ ఏ రూపంలో ఉన్నదో తెలుసుకున్న తరువాత అసహ్యం కలిగింది.

''నీ కొడుకును కాలేజీనుంచి ఎందుకు వెళ్ళగొట్టారోనని అడుగుతా వను కున్నాను. నా బాధ దేనినిగురించోనని తెలుసుకుంటావను కున్నాను.''

''ఆ కాలేజీ ప్రిన్సిపల్ ఒక చాదస్తుడు కాలేజీలలో పిల్లలు చదువుతూ ఉంటే ఇంట్లాంటివి లక్ష జరుగుతూఉంటాయి. ఏదో పిల్లలని చూసీచూడకుండా ఊరుకోవాలి గాని, అన్నిటికీ పట్టుకుర్చుంటే తను ఉద్యోగం ఏంచేస్తాడు? పిల్లలందరూకలిసి కాలేజీని బహిష్కరిస్తే తనకేమోసంవస్తుంది. లేకపోతే గోడలకు చదువుచెప్పాలి.''

హాస్పిటల్‌నుంచి ఫోనువచ్చింది-డాక్టరు, గోపాలంతో మాట్లాడాలంటు న్నాడని.

"ఫోనులో డాక్టరుతో మాట్లాడు లేకపోతే నాతోరా నేను వెళ్తున్నాను."

"నాకు ఆఫీసులో పనిచాలాఉంది. అయినా వాడొక వెర్రివాడు కాకపోతే, తండ్రిని, తల్లిని పిలవటమెందుకు? వైద్యంచేసి పంపించక? కావాలంటే మీరు వెళ్ళండి" హేళనగాచూసింది.

ఆమె వెళ్ళగాచూసి గోపాలం ఇల్లు తాళంవేసి హాస్పిటల్ కి వెళ్ళాడు.

"హలో డాక్టర్!"

"రండి రండి ఈ అమ్మాయి మీ అమ్మాయని నాకు ఇప్పుడే తెలిసింది. వెరీసారీ కాలి ఎముకవిరిగి అయిదారు రోజులయినట్టుంది. చుట్టూకుళ్ళింది చర్మం అక్కడికి తీసివెయ్యాల్సి వస్తుందేమో? తండ్రి డాక్టరయిఉండికూడా ఇలా నెగ్లెక్టు చేశారు. మీ అమ్మాయి థియేటరులోఉంది. రండి!" తీసుకువెళ్ళాడు.

గోపాలం ముఖం దించుకున్నాడు.

ఎముకవిరిగి నాలుగయిదు రోజులయిందా? కూతురుసంగతి తల్లికి తెలియదా?

గోపాలం తలవంచుకొని థియేటరులోకివెళ్ళాడు. డాక్టరు, గోపాలానికి అమల కాలుచూపించాడు. కూతురి కాలుచూసి అదిరిపోయాడు.

"అమ్మాయికి ధైర్యంచెప్పండి...మత్తుమందిచ్చే డాక్టరు వచ్చింది."

తండ్రి కూతురిదగ్గరికెళ్ళి తలనిమిరి కళ్ళారాచూశాడు జాలిగా.

అమల కళ్ళు దించుకుంది.

గోపాలం హౌస్‌సర్జనుకోసం హెడ్ నర్సును అడిగాడు.

"నైట్‌డ్యూటీవాళ్ళు ఇద్దరున్నారు. కాని ఇప్పుడులేరు అయినా ఎంక్వైరీలో అడగండి!'' ఏదో జవాబుచెప్పి ఆమె వెళ్ళిపోయింది. కాని పేరుతెలియందే అక్కడా ఎవరూ చెప్పలేదు.

గోపాలం పోలీసుస్టేషనుకు ఫోనుచేశాడు.

''హలో డాక్టర్! హాస్పిటల్‌నుండా?''

''అవును రాత్రి నాకు ఫోను చెయ్యమనిచెప్పిందెవరు? పేరు చెప్పగలరా?''

''డాక్టర్ మోహన్‌కుమార్ పొడుగ్గా, తెల్లగా ఉంటాడు.''

"హాస్పిటల్లో ఇప్పుడులేడు రేపు వస్తాడట.''

''ఎప్పుడయినా రానీయండి. ఇంకా మనకేంపని అతడితో?''

''మీ పోలీసులే ఇట్లాఅంటే నేనేం చెప్పగలను? 'అతడు నా కెందుకు ఫోను చెయ్యమన్నాడు? అతడికి ఆమె నా కూతురని తెలుసునా?' ఇవన్నీ మీరడగవలసిన ప్రశ్నలు జవాబు రాబట్టవలసినవారు మీరు."

"డాక్టర్ ఇది చాలా చిన్నవిషయం. ఇలా చాదస్తంగా ప్రశ్నిస్తూపోతే కేసు కొల్లేటి చేంతాడయిపోతుంది. ఇంతకూ అతడు చేసింది ఉపకారమేకాని అపకారం కాదుగా? అతడివల్లనేకదా మీ అమ్మాయిసంగతి నేను మీకు ఫోనుచెయ్యగలిగింది? అందుకని ఆ విషయం అంతటితో వదిలెయ్యండి'' ఫోను పెట్టేశాడు.

"ఇక్కడకూడా చాదస్తమన్నమాట వినపడుతున్నదే!" గోపాలం థియేటరు దగ్గరగా కుర్చీమీదకూర్చున్నాడు కళ్ళుమూసుకుని.

గంట తరువాత స్ట్రెచర్‌మీద అమలను బయటికి తీసుకువచ్చారు. వాళ్ళ వెంట నడిచాడు గోపాలం.

ఆపరేషనుచేసిన డాక్టరు గోపాలాన్ని కలుసుకుని మోకాలిపైవరకూ తీసేసి కుట్లువేసినట్టు చెప్పాడు.

గదిలో మంచమీద అమల పడుకునిఉంది. ఇంకా బాగా మెలకువరాలేదు. పక్కగాఉన్న కుర్చీలోకూర్చుని ఆమె తల నిమురుతున్నాడు.

అమల చూడటానికి అందంగాఉంటుంది. దానికి తగినట్టు అందంగా వేషా లంకరణ చేసుకుంటుంది. చదువులో, మాటలో అతిచురుకు. టెన్నిస్ ఛాంపియన్ కాలేజీలో చదువుతున్నది షార్ట్సు వేసుకుని టెన్నిసుఆడుతూ-సంభాషణ చాతు

ర్యంతో కాలేజీచర్చలలో, సెమినార్లలో పాల్గొంటూ ఎవరిని ఆకర్షించిందో? ఎవరి ఆకర్షణలో పడ్డదో? అసలు జరిగిందేమిటో?

ఒంటిగంటయింది అమలకు కాంటీన్‌నుంచి బ్రెడ్, కాఫీ తెప్పించాడు. ఆమె మూలుగుతూ కళ్ళు తెరవగానే-"అమలా! అమలా!" పిలిచాడు.

కళ్ళతోగదంతా కలయజూసి-"నాన్నా? నీ వెప్పుడువచ్చావు?" అడిగింది.

"ముందు కొంచెం కాఫీతాగు నా చెయ్యి నీ తలకింద పెట్టి ఉంచుతాను. తల కొంచెం ఎత్తి కాఫీతాగు బ్రెడ్ టోస్టు చేయించి తెప్పించాను మెల్లగాతిను."

ఆమెనుచూస్తుంటే అతడికి ఆమె బాల్యంలోని ఘట్టాలు కళ్ళకు బొమ్మ కట్టాయి. నాలుగేళ్ళపిల్ల తనను గ్లాసెడుపాలు తాగటానికి ఇల్లంతా తిప్పించేది. అలా పరుగులుతీస్తూ పాలు తాగించటం తనకు సరదాగాఉండేది. తను ఒంటి గంటకు క్లినిక్‌నుంచి వచ్చేసరికి పక్కవీధిలోఉన్న నర్సరీస్కూలుకు వెళ్ళివచ్చేది. ఆమెకు అన్నంపెట్టి తను భోజనంచేసేవాడు. అమలకంటే సీను మూడేళ్లు చిన్న. స్కూలుకు వెళ్ళినప్పటినుంచీ అల్లరి బాగా చేసేవాడు. రోజుకు రెండయినా తగాదాలు స్కూలునుంచివచ్చేవి. స్కూలు టీచర్లు తనకు ఉత్తరాలు రాసేవాళ్లు తను సర్దుతూ ఉండేవాడు.

అంతలో తనకు కాంటీన్ నుంచి భోజనం వచ్చింది. భోజనం చేస్తూ ఆలోచిస్తున్నాడు అమల గురించి, కాలులేని దయిపోయిందన్న బాధతో.

సాయంకాలం ఆరు గంటలకు ఇంటికి ఫోనుచేశాడు తాను, నాలుగయిదు రోజులవరకూ ఇంటికి రానని.

''ఎందుకు ?"

''అమలకు మోకాలివరకూ కాలు తీసేశారు. ఇంటికి రావటానికి ఎప్పుడు వీలవుతుందో తెలియదు. నేను అమల దగ్గర ఉంటున్నాను. క్లినిక్‌లో నా అసిస్టెంటు చూసుకుంటాడు.''

''సరే మీ ఇష్టం."

''శీను ఇంటికి వచ్చాడా ?"

"వస్తాడు, అంత బెంగ పెట్టుకుంటారేం !" ఫోను పెట్టేసింది.

"కన్నకూతురికి ఇంత ప్రమాదం జరిగితే వస్తానంటుందేమో ననుకున్నాడు. ఏమో ఇది కూడా చాద స్తమేమో ? అందుకే తను వచ్చి చూడమని అడగలేదు.

హాస్పిటల్లో ఉన్న రోజుల్లో అమలను ఎన్నో అడగాలనుకున్నాడు. నోరు మెదపబోయి మూసుకున్నాడు, అడగటానికి సమయం కాదని.

వారం తరువాత హాస్పిటల్ డాక్టరు అమలను చూసి కాలు జాగ్రత్తగా చూసుకొమ్మని గోపాలానికి, కృత్రిమ కాలు పెట్టించమనీ, చక్రాల కుర్చీ ఒకటి కొనమని చెప్పాడు.

గోపాలం అమలను జాగ్రత్తగా కారులో ఇంటికి తీసుకువచ్చాడు. ఆమె గదిలో పక్కసర్ది అమలను పసిపిల్లను ఎత్తుకువచ్చినట్టు ఎత్తుకువచ్చాడు.

ఇంట్లో ఎవరూ లేరు. తాళం తన దగ్గరున్న డూప్లికేటుతో తీశాడు. అమలను పడుకోబెట్టి ఇల్లంతా వెతికాడు. తినటానికి ఇంట్లో ఏమీ కనబడలేదు. ఫ్రిజ్ తెరిచాడు, రెండు ఆపిల్ పళ్ళు కనబడ్డాయి. వాటిని అమలకిచ్చి, తాను కారులో హోటల్ కెళ్ళి కారియరుతో భోజనం తెచ్చాడు. అమలకు పళ్ళెంలో మంచందగ్గరే పెట్టాడు, ఆమె మౌనంగా భోజనంచేసి, కళ్ళుమూసుకుని పడుకుంది.

గోపాలం భోజనం చేసి పేపరు చదువుతూ పడక్కుర్చీలోనే నిద్రకొరిగాడు. అంతలోనే టెలిఫోను మోగింది.

"హలో... అన్నపూర్ణను, ఒంటిగంట నుంచీ ఫోను చేస్తున్నాను, ఎవరూ ఎత్తటంలేదు. మా ఆఫీసువాళ్ళంతా ఎక్స్‌కర్షన్‌కు వెళ్ళుతున్నారు. నన్ను కూడా రమ్మని బలవంతం చేస్తున్నారు. ఏంచెయ్యను ? వెళ్ళకపోతే బాగుండదు. మా బాసు కూడా వస్తున్నారు. పది గంటలకు హాస్పిటల్‌కు ఫోను చేశాను, అక్కడ మీరు లేరన్నారు."

"అయితే తిరిగి ఎప్పుడు వస్తావు ?"

"అందరితో పాటు వెళ్ళినప్పుడు అందరితో పాటు వస్తావు."

"అమలను ఇంటికి తీసుకువచ్చాను. చూసి వెళ్ళకూడదూ ?"

"వ్యానులో అందరూ వెళ్తున్నారు, నా కోసం ఆగమంటే ఆగరు కదా. బయలుదేరుతున్నది వ్యాను."

అతడు మాట్లాడకుండా ఫోను పెట్టేశాడు. వంట చేయటానికి వచ్చిన వంటమనిషితో అమల దగ్గర ఉండటానికి ఒక ఆడమనిషిని చూడమని చెప్పి, క్లినిక్‌లో ఉన్న చక్రాల కుర్చీ తెప్పించాడు. అమలకు కృత్రిమ కాలు పెట్టించటానికి కొన్నిరోజులు ఆగాలికదా అనుకుంటూ ఆమె పక్కనే కుర్చీలో కూర్చున్నాడు.

అతడికి అమల సమస్య మెదడును తొలచివేస్తున్నది. పరీక్షలు కాగానే అమలకు నచ్చిన సంబంధం చూసి పెళ్ళి చేయాలనుకున్నాడు. అమలకు నచ్చిన సంబంధాలను కూడా అన్నపూర్ణ అనేక రకాలుగా విమర్శించి పడగొట్టేసింది. ఇప్పుడు పెద్ద సమస్య ఎదురైంది. అమల అమాయకురాలని అనుకున్నాడు కాని, అలా అనిపించటం లేదు. ఈమధ్య వేళకు ఇంటికే రావటంలేదు. రాత్రి ఎనిమిదింటికయినా ఇంట్లో ఉండమని చెప్పాడు. కాని ఏం లాభం ?

తల్లి వేళకు ఇంటికివచ్చి పిల్లల సంగతి కనుక్కుంటే బాగుండును కాని, తల్లే బాధ్యతలేకుండా తిరుగుతుంటే పిల్లలకు చెప్పేదెవరు ?

గోపాలం మానసికంగా అలసిపోయాడు. చటుక్కున కుర్చీలోనుంచి లేచి కొడుకు గదిలోకి తొంగిచూశాడు, ఖాళీగా ఉంది. వెంటనే ప్రిన్సిపల్‌కు ఫోను చేశాడు.

"హలో ! ప్రిన్సిపాల్‌గారా ? నమస్కారం. ఈ మధ్య మా అమ్మాయికి ఏక్సిడెంటయింది. ఇవాళే హాస్పిటల్ నుంచి ఇంటికి తీసుకువచ్చాను. అందుకే మీ దగ్గరికి రాలేకపోయాను. ఆ రోజు మీరు మా అబ్బాయిని గురించి ఫోను చేశారు. ఏమిటా వివరాలు ?"

"వివరాలు చెప్పమంటారా ? మీవాడు కాలేజీకి బీరు సీసాలు తీసుకువస్తున్నాడు. ఇంటర్వెల్‌లో చెట్లచాటున కూర్చుని తాగుతూ ఉంటాడు. అతడితో కొందరు పిల్లలు చేరుతున్నారు. ఒక అమ్మాయి తండ్రి మీ అబ్బాయిని గురించి రిపోర్టు చేశాడు. వాళ్ళమ్మాయికి మీవాడివల్ల ఎబార్షను చేయించవలసి వచ్చిందట. పోలీసురిపోర్టు కూడా ఇచ్చాడట. పోలీసులను తప్పించుకుని తిరుగుతున్నాడట.

క్లాసులకు సరిగా అటెండు కాడు. కాలేజీకి ఎందుకు రావటం.... న్యూసెన్సు చేయటానికి కాకపోతే ?"

''నిజమా ? వ్యవహారం ఇంతవరకూ వచ్చిందనుకోలేదు. పోలీసులు ఏదో హడావిడి చేస్తున్నారనుకున్నాను."

"చూడండి, తల్లిదండ్రులు పసితనంలోనే కాదు, క్రమశిక్షణ ఇవ్వవలసింది విద్యార్థిదశ ముగిసేవరకూ, తల్లిదండ్రులు పిల్లలనూ, సంసారాన్నీ పట్టించుకోకుండా తిరుగుతూ ఉంటే పిల్లలగతి ఇంతేకాక ఇంకేమవుతుంది ? మీ అబ్బాయి డ్రగ్సుకు కూడా అలవాటు పడుతున్నాడన్న వార్తలు విద్యార్థి లోకంలో వ్యాపిస్తున్నాయి. మీరు వినలేదా ? అది కూడా మీవరకూ రాలేదా ?"

"ఇంకా నావరకూ ఆ వార్తలు చేరలేదు. మీరన్నట్టు తప్పు మాది కూడా ఉందిలెండి. వివరాలు చెప్పినందుకు థాంక్సు" ఫోను పెట్టేశాడు.

ఫోనులో తండ్రి మాట్లాడుతున్నదంతా గదిలో మంచంమీద పడుకొని అమల వింటున్నది. తన సంగతి కూడా ఇవాళో, రేపో బయటికి వస్తుంది. తన భవిష్యత్తు ఈ కాలితో తారుమారయింది. ఆమె కళ్లలో నీరు గిర్రున తిరిగింది.

గోపాలం కూతురి కాలు బాగా నయమైన తరువాత కృత్రిమ కాలు పెట్టించటానికి తగిన ఏర్పాట్లు చేశాడు. ఆమె భవిష్యత్తు అతడికి అగమ్య గోచరంగా ఉంది.

ఒకరోజు కాలేజీ ప్రిన్సిపల్ ఒకసారి వచ్చి తనను కలుసుకోవలసినదిగా ఫోను చేశాడు.

మళ్ళీ ఏం జరిగింది ?

బయటకి వెళుతున్నట్టు అమలకు చెప్పి, ప్రిన్సిపల్‌ను కలుసుకున్నాడు. ఆయన రూంలో మరొక వ్యక్తి కూర్చుని ఉన్నాడు. అంతకుముందు ఉద్రేకంతో మాట్లాడినట్టున్నాడు. ముఖం ఎర్రబడి బిగుసుకుపోయినట్టుంది. ఆయాసపడుతున్నాడు.

"డాక్టరు గోపాలంగారూ ! వీరు రామచంద్రరావు, ఎడ్యుకేషనల్ ఆఫీసరు. వీరి అమ్మాయి కేసరి మూడు రోజులనుంచీ కనబడ్డంలేదు. మీ అబ్బాయీ, కేసరీ

కలసి కిద్వాయి గార్డెన్సువైపు వెళ్లగా చూశామని విద్యార్థులు కొందరు చెప్పారట. అప్పుడప్పుడు అతడు కేసరిని తీసుకువెళ్ళుతూ ఉంటాడని కూడా చెప్పి ఫోటోలు ఇచ్చారట. మీకు ఈ సంగతి తెలియదేమో ? మీ అబ్బాయి ఎక్కడున్నాడు ? అతడి భవిష్యత్తును గురించి ఏమాలోచిస్తున్నారు ?"

"మా అమ్మాయికి ఆరోగ్యం సరిగా లేదని మీకిదివరలో చెప్పినట్టున్నాను? ఆమెను గురించి ఆలోచిస్తున్నాను. అబ్బాయి అప్పుడప్పుడు కనబడుతూనే ఉన్నాడు. మా ఆవిడకు తెలుస్తుంది వాడి సంగతి. నేను ఒక వారం హాస్పిటల్లోనే ఉన్నానని తెలుసుకదా మీకు ? నేను కనుక్కుని చెప్తాను !" గోపాలానికి తల కొట్టేసినట్లయింది.

"డాక్టర్ ! మీ అబ్బాయిని గురించి ఇది మొదటి కంప్లెంటు కాదు. కాలేజీ నుంచి తీసివేసినా ఇంకా విద్యార్థినులను వేటాడుతూనే ఉన్నాడు. మీ అబ్బాయి కోసం ఊళ్ళో అమ్మాయిలంతా చదువులు మానుకొని ఇంట్లో ఉండాలా ?" ప్రిన్సిపల్ గోపాలం ముఖంలోకి చూశాడు తీవ్రంగా.

"మీరు మా అబ్బాయిని కాలేజీలోనుంచి పంపించేశారు. దానికి నేనేమనను. తప్పు వాడిది కనుక. పోలీసుకంప్లెయింటు ఇచ్చారు, బాగానే ఉంది ఇంక మా అబ్బాయిని గురించి మీకు కాలేజీపరంగా ఎటువంటి సంబంధం లేదు. ఇక పోతే, అబ్బాయి కాలేజీ ఆవరణంలోకి వచ్చి మిగతా విద్యార్థినుల వెంట పడుతున్నాడంటే పోలీసులకు చెప్పమనండి" అన్నాడు పరమశాంతంగా. దిగ్గున లేచి బయటికి వెళ్ళాడు గోపాలం.

"రామచంద్రరావుగారూ ! డాక్టరు చెప్పింది విన్నారు కదా ! మీ పిల్లలను కట్టుబాట్లలో ఉంచుకోండి, కాలేజీస్థాయిలో చదువు చెప్పగలం గాని, మేము ఇటువంటి విషయాలలో మా బాధ్యత అంతగా లేదు. కాండక్టు బాగాలేదని కాలేజీ నుంచి పంపేస్తాము గాని, ఆ తరువాత మేమేం చేస్తాం చెప్పండి. మీకు నా సలహా ఇదే."

గోపాలం ఇంటికి వెళ్తూ దారిలో ఒక టైపురైటరు కొని ఇంటికి తీసుకు వెళ్ళాడు. అన్నపూర్ణ దాన్ని చూడగానే మండిపడ్డది. "ఇదెందుకు డబ్బుఖర్చు?" అంటూ.

"భోజనం చేస్తే డబ్బు ఖర్చవుతుందని మానేస్తామా? క్లినిక్కోసం కొన్నాను. ఒక టైపిస్టును పెట్టుకోవాలి"

అన్నపూర్ణ విని ఊరుకుంది. గోపాలం ఈ మధ్య ఇదివరకు మాదిరి ఏ మాటన్నా ఊరుకోవటం లేదు. ఆమె మాటకు బదులు చెబుతున్నాడు. అతడిని తప్పుకుని తిరుగుతోంది ఆమె.

ఆ రాత్రి భోజనాల సమయంలో గోపాలం, "ఈ ఊళ్లో నీకు చాలామంది కోడళ్ళు ఉన్నారట. మనమలు కూడా పుట్టబోతున్నారు" అన్నాడు అన్నపూర్ణతో.

"నాకు కోడళ్ళా? మీ కెట్లా తెలుసు? ఎవరు చెప్పారు? ఆ ప్రిన్సిపలేనా? ఆయనకూ మీకు పనిలేనట్టుంది" చర్రుమన్నది అన్నపూర్ణ.

"పన్లేక కాదు, ఉండే చెప్పాను. ఆడపిల్లల తండ్రులు వచ్చి గోలపెడు తున్నారు. పోలీసులు నీ కొడుకుకోసం వెతుకుతున్నారు."

"అలా చెప్పండి. ఆడపిల్లల తండ్రులకు సంబంధాలు దొరక్క కాలేజీ లలో పెళ్ళికాని అబ్బాయిలమీద అభాండాలు వేసి వాళ్ళకిచ్చి పెళ్ళిచెయ్యాలన్న ప్రయత్నం. మనం విన్నదంతా నిజమని నమ్మితే చెవులు పట్టుకుని ఆడించేస్తారు అమ్మాయిల నాన్నలు."

"ఈసారి ఎవరయినా నాతో చెబితే నీ దగ్గరకి పంపిస్తాను."

"నా దగ్గరికి వస్తే ముఖం వాచేటట్లు చివాట్లుపెట్టి పంపిస్తాను. వాళ్ళ పిల్లలను అదుపులో పెట్టుకోలేక మన మీదికి తగాదాలకు రావటమేమిటి?"

అక్కడితో ఆ సంభాషణ ఆగిపోయింది. "అన్నపూర్ణ తను కూడా ఒక ఆడపిల్ల తల్లినని మార్చిపోతుంది" అని నవ్వుకున్నాడు. ఆ ఉదయం అమల వాంతులు చేసుకుంటోందని నౌకరు చెబితే మందు ఇచ్చాడు. అన్నపూర్ణ వాదన, తిన్నది అరగలేదని. అమలకు కృత్రిమ కాలు అమర్చారు. మెల్లగా నడక నేరు స్తున్నది. చక్రాల కుర్చీలో కూర్చుని ఇల్లంతా తిరుగుతున్నది.

సాయంత్రం నాలుగు గంటలకు క్లినిక్కు వెళ్ళేముందు అమల గదిలోకి వెళ్ళి కూర్చున్నాడు గోపాలం. ఆమె చదువుతున్న నవల పక్కన పెట్టి లేచి కూర్చుంది.

"వాంతులు తగ్గాయా అమలా? ఇప్పుడెట్లా ఉంది?" అడిగాడు.

"మాత్రలు కూడా వాంతి అయ్యాయి నాన్నా! మందు వద్దులే!"

"అమ్మ ఇంట్లో లేదా?"

"క్లబ్బుకు వెళ్ళింది, అరగంటలో వస్తాననీ."

"శీను వచ్చాడా? నీ కాలి సంగతి వాడికి తెలుసా? నీకు కనబడ్డాడా అసలు?"

"లేదు. నేను శీనుని చూసి ఎన్నోరోజు లయింది."

"నే నివాళ ఒక లేడీడాక్టర్ని పొద్దున పది గంటలకు రమ్మన్నాను, వచ్చిందా?"

"వచ్చింది, నా కప్పుడే వాంతి అయింది. పడుకుని ఉన్నాను. "వికారంగా ఉన్నదా?" అని అడిగింది. అవునన్నాను. పరీక్ష చేస్తానన్నదీ, వద్దన్నాను."

గోపాలానికి ఎట్లా చెప్పాలో తెలియటం లేదు. ఇటువంటి విషయాలు తల్లులు కనిపెట్టి అడగాలి. అన్నపూర్ణకు తను చెబితే నచ్చదు, నమ్మదు. అయినా డాక్టరు కనుక ఊరుకోలేక ఆమె రాగానే చెప్పాడు.

"నే ననుకుంటూనే ఉన్నా మీరీపని చేస్తారని. నాకు తెలియకనే ఊరుకున్నానా? వాడెవడో మనకు తెలియదు. అయినా ఈ కుంటిదాన్ని ఎవరూ పెళ్ళి చేసుకోరు. ఓ వారంపోయాక నేనే ఓ నర్సింగ్‌హోంకు తీసుకువెళ్ళి అబార్షను చేయిస్తాను."

"ఆ పని చేసేముందు అమలను అడుగు. దాని అభిప్రాయం కూడా తెలుసుకో."

"హుఁ అదీ, దానికో అభిప్రాయం! దాని ఇప్పటి పరిస్థితికి ఏది మంచిదో మనమాలోచించి చెయ్యాలి." అన్నపూర్ణ మాటల్లో పూర్వపు పిడివాదనల తాలూకు ఛాయలు గోపాలానికి కనబడలేదు ఆ రోజున

అన్నపూర్ణ లేనప్పుడు చూసి, "అమలా! నీతో కొంచెం మాట్లాడాలమ్మా!" అన్నాడు గోపాలం.

"ఏమిటి ?''

"అమ్మ నీకు ఎబార్షను చేయిస్తానంటోంది. చేయించుకుంటావా ?"

"నేను ముందు నా ఫ్రెండుతో మాట్లాడాలి. ఆ తరువాత ఏంచేయాలో నేను నిర్ణయించుకుంటాను. నన్నడగకుండా చేయిస్తుందా ?"

"నీవు కోపగించుకోకుండా చెప్పమ్మా, ఆ ఫ్రెండ్ ఎవరు ?"

"మోహనకుమారని ఒక హౌస్ సర్జను."

'అతడి నెలా కలుసుకుంటావు ? ఇక్కడికి రమ్మని ఫోను చేస్తావా ?"

"రోజూ చేస్తున్నాను నాన్నా ! ఎప్పుడు చేసినా డ్యూటీలో లేడంటారు."

''అమలా ! నేనొక్కమాట అడుగుతాను బాధపడకు. అతడు పెళ్ళిచేసు కుంటాడన్న నమ్మకం ఉందా ?''

"ఎందుకు ఉండదు నాన్నా ? అతడి స్నేహానికి గుర్తే ఇది."

"అయినా ఈ స్థితిలో ఒప్పుకుంటాడా ? ఈ మాట నిన్నడగటానికే బాధగా ఉంది.''

"ఎందుకు ఒప్పుకోడు ? అతడివల్లనే ఈ ఏక్సిడెంటయింది." ముక్కుపుటా లదిరాయామెకు.

"ఎప్పుడు ?" అడగలేక అడగలేక అడిగాడు.

"నన్ను హాస్పిటల్లో ఎవరు చేర్చారో తెలియదు. ఆనాటికి నాలుగు రోజులు దాటింది. మేమిద్దరం టెన్నిస్ టోర్నమెంటు నుంచి వస్తుంటే దారిలో స్కూటర్ ఏక్సిడెంటయింది. స్కూటరు బాగుచేయటానికి ఇచ్చి టాక్సీ తెస్తానని వెళ్ళాడు. రాత్రి పదిగంటలకు వెళ్ళినవాడు తెల్లవారినా రాలేదు. ఊరిబయట, మనుషుల అలికిడి లేదు. మరునాడు మధ్యాహ్నం ఒక జీపు వస్తుంటే వాళ్ళను ఊళ్లో దింప మని బ్రతిమిలాడాను, వాళ్ళు దింపిపోయారు. కూరగాయలు అమ్ముకునే మనిషితో ఇక్కడికి వచ్చాను ఆమె మార్కెటుకు వెళుతూ నన్ను ఇంకో రిక్షాలో ఎక్కించి జాగ్రత్తగా వెళ్ళమని మరీ మరీ చెప్పింది. నేను ఇంటికి రాదలచుకోలేదు. మోహన్

కుమార్ రూంకు ఆ రిక్షాలో బయలుదేరాను. ఒక ఆటో వేగంగా వచ్చి రిక్షాను కొట్టేసింది కింద పడ్డాను. ఇంక ఒళ్ళు తెలియలేదు."

"అన్నిరోజులు ఆ బాధ ఎట్లా ఓర్చుకున్నావమ్మా ?"

"యమబాధ అనుభవించాను నాన్నా ! అతడు అట్లా వదలిపెట్టి వెళ్తాడా ? అతడిని కలుసుకుని నాలుగూ ముఖాన అడగాలన్న ఉద్రేకంతో బాధ ఓర్చుకున్నాను నాన్నా !"

గోపాలానికి కళ్ళు చెమర్చాయి. "అమ్మా అతడిని చివాట్లు పెట్టాలని ఓర్చుకున్నావుగాని, కాలుపోయింది కదమ్మా !"

"పోయింది మరి అతడి వల్లనేగా ?"

"అని అతడూ అనుకోవాలి కదమ్మా !"

"అనుకోక....?"

అంతలో అన్నపూర్ణ వచ్చింది. "ఏమిటి ఆలోచిస్తున్నారు తండ్రీ, కూతుళ్ళు ?"

"అమల ఒక్కటే ఉన్నదని ఏదో మాట్లాడుతూ దానికి కాలక్షేపం కలిగిద్దామని కూర్చున్నాను.''

అన్నపూర్ణ వస్తూనే చికాకుతో వచ్చింది. అందరిమీద రుస రుస లాడుతున్నది. అది మామూలేగా అనుకున్నాడు గోపాలం.

సాయంకాలం ఆరుగంటలయింది. గోపాలం క్లినిక్‌లో ఉన్నాడు. అన్నపూర్ణ అలసిపోయినట్టుగా కుర్చీలో కూర్చున్నది. ఎవరో ఇద్దరు ఆడవాళ్ళు వచ్చారని తెలిసి బయటికి వచ్చింది.

వచ్చిన వాళ్ళిద్దరూ చెరొకవైపునా నిలబడి "క్లబ్బులో కనబడినప్పుడు ఇంటికివస్తే మాట్లాడతానన్నారని వచ్చాము" అన్నారు.

అన్నపూర్ణ ముఖం ఎర్రబడ్డది.

"మీ అబ్బాయి ఎక్కడ ఉన్నాడు ? కనబడకుండా పారిపోయినంత

మాత్రాన ఈ బాధ్యతను తప్పించుకోవచ్చు ననుకున్నారేమో? రెండు నెలలనుంచీ గాలిస్తున్నాము పోలీసు కంప్లైంటు ఇచ్చాము. లాభం లేకపోయింది. ఇదిగో ఈ అమ్మాయి మీ కోడలు. నాలుగవ నెల వచ్చింది. పెళ్ళిచేసుకుంటారో ఏం చేసుకుంటారో మీ ఇష్టం" అని అమ్మాయిని పెట్టెతోసహా ఇంట్లోకి పంపించింది.

అన్నపూర్ణ నివ్వెరపోయింది. కొంతసేపటికి తేరుకుని- "క్లబ్బు పార్టీలో వదినగారూ ! అని పిలిస్తే హాస్యాని కనుకున్నాము. కోడలు కోడలు అంటే ఎగతాళి కనుకున్నాను. నలుగురిలో ఈ హాస్యాలేమిటని ఇంటికి రమ్మన్నాను గాని, ఈ పెట్టేమిటి ? ఈ పెట్టెతో పిల్లను దింపటానికి వచ్చారా ?" అని కస్సుమంది.

తల్లి వినిపించుకోకుండా గబగబా గేటుదాటింది.

అన్నపూర్ణ మండిపడుతూ లోపలికివచ్చి నాలుగుమూలలా కలయజూసింది. ఆ అమ్మాయి అప్పటికే ఖాళీగా కనబడ్డ గదిలోకి పెట్టెతోకూడా ప్రవేశించింది.

అన్నపూర్ణ ఆ గదిలోకి వచ్చి "ఓహో ! గదిలోకి ప్రవేశించావా ? బయటికి నడు నాకు శ్రమ ఇవ్వకుండా ?" చెయ్యి బయటికి చూపించింది.

అమ్మాయి నిలబడిపోయింది కాని కదలలేదు.

"నీలాగ తిరిగే ఆడపిల్లలు మగపిల్లలు కనబడగానే వెంటబడతారు పెళ్ళి చేసుకోమని మీ అమ్మ వదిలిపెట్టి పోయిందని ఇక్కడ ఉందామనుకున్నావా ?" అరిచింది.

"నేను వెళ్ళటానికి రాలేదు. ఇక్కడే ఉండిపోవాలని వచ్చాను. నా ఇంటి నుంచి నన్నెవరు పంపగలరు ?" అన్నపూర్ణ కంఠంకంటే హెచ్చుస్థాయికి పెంచింది అమ్మాయి.

సరిగ్గా ఆ సమయంలో గోపాలం ఇంట్లో అడుగుపెట్టాడు. మాటలుకొన్ని వినబడ్డాయి. పరిస్థితి అర్థమైంది

"అమ్మాయీ ! నీవు రామచందరావుగారి అమ్మాయివా ? నీపేరు కేసరి కదూ ?" అడిగాడు దగ్గ కి వచ్చి

"అవునండి" అన్నది ఆశ్చర్యపోతూ.

"అఁహాఁ ? అయితే మీ కిదివరకే ఈ అమ్మాయి తెలుసునన్నమాట. మీరు రమ్మనమని చెప్పిఉంటారు. లేకపోతే ఈ అమ్మాయికంత ధైర్యమా లోపలికి రావటానికి ?" కాళికావతార మెత్తింది. అన్నపూర్ణ.

"రభస చేసుకోవటం వీధినపడటం ఎవరికీ మంచిదికాదు. ఈ అమ్మాయి సంగతి నీకిదివరకే చెప్పాను. ఫోటోలతోసహా వీళ్ళిద్దరిని గురించి తండ్రి ప్రిన్సిపల్ దగ్గరికి వచ్చిచెప్పాడు. ఇది సాక్ష్యాధారాలు గల కేసు. బాగా ఆలోచించు."

"నాదగ్గర అంతకంటే బలమైన సాక్ష్యముంది. మీ అబ్బాయి నాతో మాట్లాడిన మాటలు టేపుచేశాను. కిద్వాయ్ కాలేజీ బుక్ చేశానని చెప్పగానే టేపు రికార్డరు నాతో తీసుకెళ్ళాను. వినండి." పెట్టెలోనుంచి తీసి టేప్ రికార్డరు ఆన్ చేసింది.

ఆ మాటలు విన్న గోపాలం అన్నపూర్ణా నిశ్చేష్టులయ్యారు కాని, అన్నపూర్ణ అంతలోనే మనసు మార్చుకుంది.

"మీకిష్టమయితే ఈ అమ్మాయిని మీవెంట తీసుకువెళ్ళి క్లినిక్‌లో ఉంచుకోండి. నాలుగోనెల అంటోంది. పురుడుకూడా పోయిస్తారా? ఏదయినా నా ఇంట్లో పనికిరాదు...." గర్జించింది

అమల చక్రాల కుర్చీలో కూర్చుని హాల్లోకి వచ్చింది. "హాయి కేసరీ! నీవేనా అప్పటినుంచీ మాట్లాడేది ?"

"హాయి అమలా! ఇదేమిటి చక్రాల కుర్చీలో తిరుగుతున్నావు? సరదాగా ఉందేమిటి ?" దగ్గరగా వచ్చి భుజంమీద చెయ్యేసింది. ఇద్దరు నవ్వుకున్నారు.

గోపాలం వాళ్ళిద్దరినీ వింతగా చూస్తున్నాడు వీళ్ళిద్దరి సమస్యలనూ తను పరిష్కరించగలడా ? తలగోక్కున్నాడు

ఏవిధంగా ? అన్నపూర్ణ దేనికి కలిసిరాదు.

కేసరి, అమలా గదిలోకి చేరుకున్నారు. చాలా సేపు తమ కాలేజీ కబుర్లు చెప్పుకున్నారు. ఇద్దరూ టీ తాగారు.

"అమలా ! ఏమయింది నీ కాలికి ?"

"ఇదా ? ఒక స్నేహితుడిచ్చిన బహుమానం."

"అంటే ?"

అమల జరిగినదంతా చెప్పింది. "అతడికి ఎన్నిసార్లు టెలిఫోను చేశానో లెక్కలేదు. అతడు ఉండికూడా లేడనిపిస్తాడు. ఈ స్థితిలో నేను వెతుక్కుంటూ పోలేనుకదా. ఇప్పుడు నేనేం చెయ్యాలి ? ఎబార్షను చేయిస్తానని అమ్మ పట్టుబడు తోంది. చేయించుకుంటే మాత్రం పెళ్ళి జరుగుతుందా ?"

"అమలా ! నీసంగతి దారుణంగా ఉంది. నా సంగతి సందిగ్ధంగా ఉంది. నన్ను నమ్మించి మోసంచేశాడు. ఇంట్లో అమ్మా నాన్నలు ఎవరయినదీ పేరు చెప్పమని బాధిస్తుంటే ఆ బాధ పడలేక చెప్పాను. దాని ఫలితం అమ్మ ఇక్కడికి తీసుకువచ్చి వదిలిపెట్టింది. మీవాళ్ళు ఉండనిస్తారో, లేదో ?''

"అంత భయపడతావేం ?"

''ఏం చెయ్యను ? కాలేజీలో విద్యార్థుల దగ్గర్నించి ప్రిన్సిపల్ వరకూ మా సంగతి మోతమోగుతోంది. గోడలనిండా మా బొమ్మలే. ఈ సంఘం నుంచి ఎక్కడికి పారిపోతాం? ఆ ఇంటినుంచి వెళ్ళగొట్టినా ఈ ఇంటి చూరు పట్టుకునైనా వేలాడాలి. ఈ బిడ్డను కనాలంటే అతడెక్కడున్నాడో వెతికి పట్టుకు. పెళ్ళిచేసుకోవాలి. అనుకున్నట్టు జరిగితే బాగుంటుంది. లేకపోతే ఈ జీవితానికి గుడ్ బై."

"మంచి పట్టుదలమీద ఉన్నావు. నాసంగతి మరీ అధోగతిగా ఉంది." కన్నీళ్లు చెంపలమీదుగా జారిపోతున్నాయి అమలకు.

"మోహన్‌కుమార్ కదూ ? వాడు నీచాతినీచుడు. వాడి వలలో పడని ఆడ పిల్లలేదు. మంత్రగాడనుకో. మా కాలేజీ విద్యార్థినులు చాలామంది అతడి వలలో పడ్డవాళ్ళే. వాళ్ళేనాకు మోహన్‌కుమార్‌ను గురించి చెప్పారు. అయితే ఏం? అతడు కాకపోతే మరొకరి వల్ల మోసపోయాను."

"అయితే మోహన్‌కుమారు రాడంటావు. నన్ను మోసగించి, కాలు విర గ్గొట్టి అడవిలో వదలినవాడు నాకంటికి కనబడితే వాడిని చంపి, నేను చస్తాను. అదొక్కటే నాకు తోచిన పరిష్కారం."

"అమలా! నేను లోపలికి రావచ్చా అమ్మా?"

"మేమేదో మాట్లాడుకుంటున్నాము. నీవు లోపలికి రా. మేము చాలా రోజులకు కలుసుకున్నాం నాన్నా!"

"అమ్మాయిలూ! నేను టీన్ ఏజరుని కాదు. మీరూకాదు. ఆ దశ దాటిన వాళ్ళే. మీ ఇద్దరి సంభాషణలు విన్నాను. మిమ్మల్ని గురించే ఆలోచిస్తున్నాను. నేనొక నిర్ణయానికి వచ్చాను. అమల నా క్లినిక్‌లో టైపిస్టుగా పనిచేస్తుంది. బిల్సు చేయటం, లెక్కలు రాయటం వంటి పనులలో నాకు సహాయంచేస్తుంది. క్లినిక్ దగ్గర ఒక ఫ్లాట్ కొన్నాను. దానిలో మీరిద్దరూ ఉండండి. కేసరీ! నీకు నేను ఉద్యోగం ఒకవారంలో చూస్తాను. మీకు ఎటువంటి భయమూలేదు. మీబిడ్డలను తాతగా నేను పెంచుతాను. అన్నపూర్ణ వద్దంటే నేనుకూడా వచ్చి మీ దగ్గరే ఉంటాను. మీరిద్దరూ ఇప్పుడే నాకు మీ నిర్ణయాలు చెప్పక్కర్లేదు. రెండురోజులు టైమిస్తాను. ఇద్దరూ ఈ గదిలో ఉండండి ఒకరికొకరు తోడుగా రోజులు గడుస్తుంటే అదృష్టాలు మారే అవకాశముంది."

అమలా, కేసరీ ముఖాలు చూసుకున్నారు.

డాక్టరు గోపాలంపెట్టిన గడువు తీరకముందే ఆ అమ్మాయిల జీవితం మరోమలుపు తిరిగింది.

సాయంత్రం ఆరుగంటలవేళ టెలిఫోను మోగింది.

కేసరి టెలిఫోను అందుకుంది. అది అమలకోసమని తెలియగానే ఆమెకిచ్చింది.

"నేను మోహన్‌కుమార్ ఫ్రెండును. అతడి చెల్లెలిపెళ్ళి రిసెప్షను రేపు సాయంత్రం ఆరుగంటలకు అశ్విని హోటల్లో. అతడు పనిలో మునిగిపోయాడు. మిమ్మల్ని రమ్మని ఫోనుచెయ్యమన్నాడు."

"అక్కడుంటే మోహన్‌కుమార్‌ను పిలవండి."

"లేదు. పూలదండలు ఆర్డరు చెయ్యటానికి వెళ్ళాడు."

"వస్తాను. తప్పకుండా వస్తానని చెప్పండి."

''అమలా ! తప్పకుండా వస్తానంటున్నావు. ఎక్కడికి ?

"పెళ్ళి రిసెప్షను. మోహన్‌కుమార్ చెల్లెలిది. అశ్విని హోటల్లో."

"వెళ్తావా ?''

"వెళ్తాను. ఆ పిలుపుకోసమేగా అలమటించిపోతున్నాను."

''ఎలా వెళతావు ఈ కాలితో?''

"అశ్విని హోటల్లో పైకి పోవటానికి మెట్లున్నాయి. ఒక వరండాలోనుంచి పోవాలి. ముందుగా ఒక రిక్షాలో వెళ్ళి మెట్లదగ్గర కూర్చుంటాను. పైకి వెళ్ళేటప్పుడు కనబడతాడుగా."

"అమలా! ఇంత జరిగిన తరువాతకూడా నీవతడు పిలిచాడని ఎవరో చెబితే వెళ్ళాలని సంబరపడుతున్నావు. ఇది అతడి పిలుపుకాదు ఒకవేళ పిలిచినా మంచికోసంకాదు "

ఆ రాత్రి భోజనాల దగ్గర కేసరి టెలిఫోను సంగతి గోపాలంతో చెప్పింది.

గోపాలం అమల ముఖంలోకి చూశాడు. ఆమె ముఖం సంబరంగా ఉన్నట్టు కనబడ్డది. వెంటనే లేచి గోపాలం అశ్విని హోటల్ కి ఫోనుచేసి ఆ మరునాడు పెళ్ళి రిసెప్షను ఉన్నదా అని అడిగాడు. లేదని జవాబు వచ్చింది.

"విన్నావా అమలా ! రిసెప్షన్ లేదట. ఆ ఫ్రెండు ఎవరోకాని నీ కాలి సంగతి తెలియక ఫోనుచేశాడు. అర్థమైందా ?''

ఆ తరువాత మాటలు సాగలేదు.

తెల్లవారిన తరువాత గోపాలం అమ్మాయి లిద్దరినీ ఫ్లాట్ లోకి తీసుకు వెళ్ళాడు కేసరికి ఉద్యోగం వచ్చేవరకూ తన క్లినిక్‌లో పని చెయ్యమన్నాడు. మధ్యాహ్నానికి హోటలునుంచి భోజనం వచ్చింది. సాయంత్రం నాలుగుగంటలకు గోపాలం వంటచేసుకోవటానికి కావలసిన సామగ్రి కొనుక్కొచ్చాడు. రెండు టేపు మంచాలతోసహా అన్నీ అమర్చాడు. ప్రత్యేకంగా అమలకోసం పెట్టిన నౌకరు కూడా వచ్చింది.

రాత్రి ఎనిమిదిగంటలకు గోపాలం వాళ్ళిద్దరినీ క్లినిక్‌నుంచి ఫ్లాట్‌లోకి తీసుకువెళ్ళాడు. టిఫిన్ కారియరు వచ్చింది.

గోపాలం ఇంటికి వెళ్ళిన తరువాత అమ్మాయిలిద్దరూ కబుర్లు చెప్పుకుంటూ భోజనాలు చేశారు. సినిమాలను గురించి మాట్లాడుకుంటూ నిద్రకొరిగారు.

మరునాడు ఉదయం ఎనిమిది గంటలకు గోపాలం అమ్మాయిలను తీసుకు వెళ్ళటానికి వచ్చినప్పుడు- "ఇంకా నిద్రలేవలేదని" పనిమనిషి చెప్పింది.

గోపాలం ''లేవండి. క్లినిక్ వేళయింది" పిలిచాడు.

"ఇద్దరూ ఇంకా దుప్పట్లు కప్పుకుని పడుకున్నారా ?" అంటూ దుప్పట్లు తొలగించాడు. చేతులు పట్టుకుని సందేహంతో నాడి చూశాడు.

''మిమ్మల్నిద్దరినీ జాగ్రత్తగా కాపాడాలని ఇక్కడికి తీసుకువచ్చానమ్మా! నన్నెందుకు మోసగించారమ్మా ? క్లినిక్‌లో పనిచెయ్యమంటే నిద్రమాత్రలు తిన్నారా తల్లీ!'' గోపాలం చిన్నపిల్లవాడిలా బావురుమన్నాడు-నిద్రపోతున్నట్టుగా ఉన్న ఆ అమ్మాయిల ముఖాలుచూసి.

నౌకరు ఈ సంగతి అందరికీ చేరవేసినట్టుంది. పుణ్యాత్ములెవరో పోలీసు రిపోర్టు ఇచ్చారు. కేసులకోసం ఎదురుచూస్తున్న పోలీసు వ్యాను పావుగంటలో అక్కడికి చేరుకుంది.

ఏడుస్తున్న గోపాలం పోలీసులను చూసి దిగ్గునలేచి జరిగినదంతా చెప్పాడు.

"పోస్టుమార్టం చెయ్యాలి. మీకు తెలియనిదేముంది ? ఈ అమ్మాయిల పేర్లు చెప్పండి. బాధపడకండి డాక్టర్. ఇప్పుడొచ్చేవి చాలావరకూ ఇటువంటి కేసులే. చెప్పండి పేర్లు. రాసుకుంటాం."

''పేర్లా ? ఈ అమ్మాయిపేరు మిసెస్ మోహన్‌కుమార్. ఆ అమ్మాయి మిసెస్ శ్రీనివాస్."

"మరి మీరు మొదట అలా చెప్పారు ?"

"అవును. చెప్పినమాట నిజమే. వీళ్ళకు పెళ్ళిళ్ళు అయ్యాయి. మెళ్ళో మంగళసూత్రాలు పడలేదు. రిజిస్ట్రారు ఆఫీసులో సంతకాలు కాలేదు."

వ్యాన్ కదులుతుంటే గోపాలం గుండె జారిపోయినట్లయింది.

కూలబడ్డాడు తలమీద చేతులు పెట్టుకుని.